# మమత

వై.సి.పి. వెంకటరెడ్డి



**ఆకాశం మేఘావృతమయింది.**

**వానకురిస్తే గుడిసె కారుతుందేమోనని తన గుడిసెను, ఆకాశాన్ని మార్చిమార్చి చూస్తావుంది గంగులమ్మ.**

గుడిసె కప్పడంలాగే అతుకులతుకులుగా ఉంది గంగులమ్మ కట్టుకున్న చీర. తొడుక్కున్న జాకెట్టుకు ఎప్పుడో వయసు చెల్లిపోయినా పారేస్తే మరో ఆచ్ఛాదన లేక ఆ పని చేయలేకపోయింది.

కుడిచేతిలో రెండు, ఎడమచేతిలో మూడు రంగువెలిసిపోయిన మట్టి గాజులున్నాయి.

గంగులమ్మ గుడిసె చుట్టుపక్కల ఉన్నవన్నీ గుడిసెలే. ముఖం కడుక్కోవడం, పాత్రలు కడగడం, స్నానం చేయడంలాంటి పనులన్నీ గుడెసెల ముందే చేయడం వల్ల వర్షంరాకపోయినా రొచ్చురొచ్చుగా ఉంటుంది.

మంచం అడ్డు పెట్టుకుని, విడిచేసిన చీర దానిమీద తెరలా వేసి తమ గుడిసెల ముందే స్నానం చేస్తారు ఆడవాళ్లు. మంచమూ గతిలేనివాళ్లు వాళ్ల పాట్లు వాళ్లు పడతారు.

గంగులమ్మను ఆ ఊళ్లో ఎక్కువమంది గంగు, లేక గంగులు అంటారు. ఆమె భర్త పేరు రంగన్న. ఆ దంపతులకు ముచ్చటగా ముగ్గురే పిల్లలు. ఇద్దరాడ పిల్లలు. ఒక మగపిల్లాడు. పెద్ద పిల్ల పేరు ఎల్లమ్మ, చిన్నదాని పేరు లచ్చి. పిల్లోని పేరు నాగన్న.

కప్పకాలికి చీరపీలిక కట్టి ఆడుకుంటున్నాడు నాగన్న. అది గెంతినప్పుడు చప్పట్లు కొడుతూ కేకలేస్తున్నారు ఆడపిల్లలు.

"ఒరే నాగా! కప్ప ఉచ్చపోత్తే కప్పకురుపులు లేత్తాయి. ఇడిసిపెడతావా, లేదా?" కసురుకుంది గంగులమ్మ.

కప్ప మీదికి దూకడానికి పొంచుకున్న పిల్లికూనను పట్టుకుని చంకలో పెట్టుకుంది ఎల్లమ్మ.

కొట్లాడుకుంటున్న రెండు కుక్కపిల్లల్తో ఆడుకుంటోంది లచ్చి. కప్పను వదిలేసి కుక్కపిల్లను ఎత్తుకున్నాడు నాగన్న.

"నా కుక్కపిల్లను పట్టుకోవద్దు!" అంటూ లాక్కుంది లచ్చి.

నాగన్న వదల్లేదు. వెనుక కాళ్లు ఒకరు, తల

ఒకరు పట్టుకుని లాగసాగారు. 'కయ్యో ... కయ్యో!' అంటోంది కుక్కపిల్ల.

"ఒరే, నాగా! గంగమ్మఆట ఆడుకుందామా?" అంది ఎల్లమ్మ.

"వద్దు అమ్మ కొడుతుంది!" అన్నాడు నాగన్న.

ఓ రాతికి పసుపుపూసి, కుంకుమబొట్లుపెట్టి దానికి తొండలను, తూనీగలను బలిస్తారు. అదే గంగమ్మ ఆట.

తొండల్ని, తూనీగల్ని చంపడానికి ఒప్పుకోదు గంగులమ్మ. ఆ ముందు రోజు తొండను చంపినందుకు నాగన్నను కొట్టింది గంగులమ్మ.

బజారులో వస్తున్న రిక్షాను చూసి గుడెసె ముందు ఆడుకుంటున్న పిల్లలు గుడిసెలోకి దూరుకున్నారు. పొయ్యిలో పుల్లలు ఎగదోస్తున్న గంగులమ్మ గుడిసె బయటికొచ్చి, అంతలోనే ఒడుపుగా ముఖం తిప్పుకోని లోనికిపోయి పొయ్యిలో పుల్లలు ఎగదోయసాగింది.

రిక్షా గుడిసె ముందు నిలిపి, "ఏం సేత్తా వుండావే నంజా! ఇంకా పొగ వస్తావుండాది!" అంటూ గుడిసెలో అడుగుపెట్టాడు రంగన్న.

"ఒరే, నాగా! ఏం సేత్తా వుండావురా?" అన్నాడు అంతలోనే తన భార్య జవాబుకు ఎదురు చూడకుండా.

ఆకాశంలో డేగను చూసి ఏ చెట్టుకిందో నక్కిన పక్షిపిల్లల్లా ఓ మూల నక్కిన నాగన్న బిక్కుబిక్కుమంటూ నాయన కేసి చూడసాగాడు తనకేందో మూడిందన్న భయంతో.

"రారా, ఎర్రి నాయాలా! ఇదో ... ఇదేందో సూడు!" అంటూ పక్క జేబులో నుంచి ఓ తాటిముంజ తీసి చూపించాడు రంగన్న.

లేచి, వణుకుతూ వణుకుతూ వెళ్లి నాయిన ముందు నిల్చున్నాడు నాగన్న.

"అక్కయ్యోల్లక్కూడా ఇత్తావా?" అంటూ వాడి చేతికి తాటిముంజ ఇచ్చాడు.

ఇస్తానన్నట్లు తలఎగరేసి, నాయన చేతిలోని తాటిముంజ తీసుకుని యథాస్థానంలో కూర్చున్నాడు నాగన్న.

మోహిని చేతుల్లోని అమృతభాండంకేసి ఆశగా చూసిన అసురుల్లాగా తమ్ముని చేతిలోని తాటిముంజకేసి ఆశగా చూడసాగారు ఆడపిల్లలిద్దరూ.

"ఏందే ఇంగా పొయ్యి మండసేత్తా ఉండావ్? సంగటికాలా?" ప్రశ్నించాడు రంగన్న. నాటు సారాయివాసన గుప్పుమంటూ గుడిసెనిండా నిండు కుంది.

"అయిందిl" అంది గంగులమ్మ పైట కొంగుతో ముక్కు మూసుకుని.

"పొయ్యిమిందుండేదేంది మల్ల?"

"సింతశారు."

"ఎందుకు?"

"తినేదానికి?"

"శాపలశారు లేదూ?"

"లేదు."

"ఏమయింది?" గద్దించాడు రంగన్న.,

"పిల్లోల్లు తినేసిండారు."

"ఎట్టా తినేత్తారే, నీకు బయమూ బత్తీ ఉంటే!"

"రేత్తిరి శారు గదా? కాసింతుంటే పిల్లోల్లు నాక్కుండారు."

"నువ్వే గాడ్దులు కాత్తా ఉంటివా? రిక్సా తొక్కి రెక్కలిరుసుకోని కొంప కొత్తే నీకేమన్నా లెక్కా జమా ఉందా? మా రిక్సా మేనేజరు బార్య సూడు, ఆయన యెక్కడన్నాపోయి ఇంటికొత్తే వాగిట్లోకి యెదురొచ్చి మొగం సేటంత సేసుకోని మాట్లాడిత్తుంది. నువ్వా ఉంటావు ... తూగుమొగం దానివి. థూ!"

"ఆల్లకేం మారాజులు! అన్నిపనులు సేసిపెట్టేదానికి దండిగా మనుషులుంటారు. ఇంటింట్లో శాకిరీసేసి సందకాటికి నాకు పానానికొత్తుంది. తీరుబాటుంటే గదా వాగిట్లోకి యెదురొచ్చి మాట్లాడేదానికి."

"తీరుబాటు యెట్లుంటుందే నీకు... వెయ్యిండ్ల పూజారివి!"

"పని లేకుండా ఊరికే ఎవురి కొంపలోనన్నా అడుగుపెట్టగా సూసినావా ... కడుపుగ్గాని కూతలు ఎందుక్కూత్తావ్?"

"ఏం కూత్తావే నంజా...నాయి కూతలా? తిని కొవ్వు పట్టిందే! నీకు పడేటివి పడితేగాని నీకు బుద్ది రాదే!" అంటూ కొప్పు పట్టుకుని జరజర లాగి దబదబ బాదాడు రంగన్న.

రంగన్న దినచర్యల్లో ఏది తప్పినా తాగడం, భార్యను బాదడం మాత్రం తప్పదు. ఆ రెండూ అతని నిత్యకృత్యాల్లో అనివార్యమయిన జంట కార్యక్రమాలు.

పిల్లలు ముగ్గురూ ఏడవసాగారు.

"ఊరోల్ల వుచ్చులు తాగొచ్చేది నన్ను సావగొట్టేది ... ఎన్నాల్లుందో నాకింగా ఈ యంపురం ఈదడానికి ..." ఏడుస్తూనే సాధిస్తోంది గంగులమ్మ.

ఇరుగుపొరుగు వాళ్లంతా గుమిగూడి తమాషా చూడసాగారు.

"మీకు సంసారాల్లేవూ? మీ మొగుల్లు మిమ్మల్ని కొట్టరూ! ఏం సూత్తారు ... నా ..." అంటూ ఏదో తిట్టబోతూ ఉండగా -

"వాల్లనెందుకు తిడతావు!" అంది గంగులమ్మ ముందుజాగ్రత్త చర్యగా.

"తాగుబోతు ముండాకొడుకు... వాన్తో మనకెందుకు పద!" అనుకుంటూ ఒక్కొక్కరే జారుకున్నారు.

"ఇంటివేమే దాండ్ల కూతలు!" అంటూ వాళ్లమీది కోపం భార్యమీద చూపాడు రంగన్న. అత్తమీది కోపం దుత్తమీద చూపినట్లు.

"నీ సేతులిరగా ... నీకు దూము తగలా ... నీకు సావన్నా రాదే!"

"సూడు.... సూడు ... ఎట్టా సాపిత్తా ఉండాదో! ఎముకలు ఇరగ్గొట్టాల్నే నీకు...!" అంటూ గంగులమ్మ జుట్టు పట్టుకుని వంగదీశాడు రంగన్న.


"అమ్మా! అమ్మా!" అంటూ తల్లిని కావలించుకున్నారు పిల్లలు.

"థూ! అంతా పోయి యాడన్నా దుంకి సావండి! ఒసే నంజా ఇంక నీ మొగం సూత్తే నీ కొడుకే అనుకో!" అని తూలుతూ రిక్షా ఎక్కి వెళ్లిపోయాడు రంగన్న.

తగిలిన దెబ్బల్ని తడుముకుంటూ వెక్కసాగింది గంగులమ్మ.,

తండ్రి వెళ్లిపోగానే నిక్కరు జేబులోనుంచి తాటిముంజ బయటికి తీశాడు నాగన్న.

"రూంతీరా ... రూంతీరా!" అంటూ



## గెడ్డం

"ఆర్డరిచ్చి చాలాసేపయింది...అసలు సప్లయ్‌చేసే ఉద్దేశ్యం ఏమైనా ఉందా, ప్రొప్రయిటర్?" కోపంగా అడిగాడు అరుణ్.

"ఆర్డరెవరికి ఇచ్చారు, సార్...ఆ గెడ్డంవాడికా?" ప్రశ్నించాడు ప్రొప్రయిటర్?

"నేను ఆర్డరిచ్చినప్పుడు గెడ్డాం లేదు...ఇప్పటికి పెరిగినా, ఆశ్చర్యపోవాల్సిందేమీద లేదు." వ్యంగ్యంగా అన్నాడు అరుణ్.

జి. జోగారావ్, హౌరా

ఆడపిల్లలిద్దరూ వాడి వెంట పడ్డారు.

"ఊహుఁ ... ఊహుఁ ..." అంటూ పరుగు లంకించుకున్నాడు నాగన్న.

* * *

రంగన్న రాక కోసం ఎదురుచూస్తూ రాత్రంతా గడిపింది గంగులమ్మ. కోడికూతలు, పక్షుల కిలకిలారావాలు, కాకుల అరుపులతో తెల్లవారింది. ముక్కుతూ మూలుగుతూ లేచింది గంగులమ్మ. ఆమె మనసు రోజూలాగా మామూలుగా లేదు. తన మామను గురించిన ఆలోచనలు ఆమె మస్తిష్కంలో ముసురుకున్నాయి.

నిన్న మాపిటేల పోయిన మావ ఇంగా ఇంటికి రాలే ... ఎబుడు పోయినా కైపు తగ్గినాక సగంరేతిరికి తిరిగొచ్చేవోడు. ఈ పొద్దు తెల్లారినా రాలే. రానని ఒట్టేసుకుని పోయినాడు. నిజంగానే రాడా? రేత్తిరి సంగటికడి కూడా తినకుండా పోయుండాడు. కడుపులో ఆదరువు లేక ఎంత బాధపడుతుండాడో ఏమో ... శాపలశారుంటే రగడ జరిగేది కాదు ... ఆలోచిస్తూ బజారుకేసి చూసింది.

దూరంగా ఓబులేశు కనిపించాడు. అతడు గంగులమ్మ చిన్నాయన కొడుకు.

"ఓబులేసు వత్తా ఉండాడు. మా ఇంటికే వత్తా ఉండాడు. వాని మొగం సూసి శాన్నాల్లయింది. లేక లేక వత్తా ఉండాడంటే ఏందో ఇసేసం ఉంటాది. వాల్ల బావేమన్నా కనపన్నాడేమో!" అనుకుంటూ ఉండగా ఓబులేసు గుడిసెలోకి వచ్చాడు.

ఆదరాబాదరా లేచి, కుక్కిమంచంమీద పాత దుప్పటి పరిచి, "కూచోరా ఓబులూ!" అంది గంగులమ్మ. ఆడుకుంటున్న పిల్లలు లోనికొచ్చారు.

కూచున్నాడు ఓబులేశు. వాడి మొకం చూసి గంగులమ్మ గుండె గుబేలు మంది.

"ఓబులూ, మీ బావేమన్నా కనపన్నాడా?"

"అవునక్కా, అది చెబుదామనే వచ్చినా!"

"యాడ కనపన్నాడ్రా?"

మవునంగా చేతిగుడ్డతో కళ్లు తుడుచుకున్నాడు ఓబులేశు.

"ఏమన్నా పెమాదం జరిగిందా?"

"బావకూ మనకూ ఋణం తీరిపోయిం దక్కా!" అంటూ గొల్లుమన్నాడు ఓబులేశు.

"అయ్యో ... నా దేవుడో!" అంటూ ఏడవసాగింది గంగులమ్మ.

ఇద్దరూ ఏడ్వటం చూసి పిల్లలు ముగ్గురూ భోరుమన్నారు.

చుట్టుపట్ల గుడిసెల్లోని జనం గంగులమ్మ గుడిసెచుట్టూమూగి- "ఏమయింది? ఏమయింది?' ' అంటూ ప్రశ్నల వర్షం కురిపించసాగారు.

"మా ... బా...వ ... సచ్చి...పోయినాడు!" అన్నాడు ఓబులేశు వెక్కుతూ.

"నిన్న సందకాడ సూత్తినే అబుడే ఎట్టా సచ్చిపోయిండాడు?" ఒకేసారి కొన్ని గొంతులు పలికాయి.

"యా...క్సి...డెంటు ... జరిగింది!"

"ఏం యాక్సిడెంటు? ఎక్కడ జరిగింది?"

"చిత్రావతి బ్రిడ్జిమీద బస్సు - లారీ గుద్దుకున్నాయి!"

"మీ బావ బస్సులో ఉన్నాడా? లారీలోనా?"

"బస్సులో."

"బస్సులో ఎందుకు పోయిండాడు?" అడిగింది ఓ నడి వయస్కురాలు.

"ఏమో మరి!" అన్నాడు ఓబులేశు.

అదే ప్రశ్న గంగులమ్మనూ అడిగారు జనం.

"ఏమో, నాకు తెల్దు!" అంది గంగులమ్మ పైటకొంగుతో కళ్లు తుడుచుకుంటూ.

"ప్రమాదం జరిగిందేకాడికి నువ్వు పోయొచ్చినావా?" ఓబులేశును అడిగాడు ఓ వ్యక్తి.

"లేదు."

"అయితే రంగన్న సచ్చిపోయిన సంగతి నీకెట్ల తెలుసు?"

ధర్మసందేహం వెలిబుచ్చాడాయన.

"మా బావ బస్సెక్కినప్పుడు చూసినోల్లు చెబుతున్నారు."

"ఏమని?"

"రంగన్న అదే బస్సెక్కినాడని."

"బస్సులోని ప్రయాణీకులంతా సచ్చిపోయినారా?"

"కొంతమంది సచ్చిపోయినారంట, కొంతమంది దెబ్బలు తగిల్నాయి!"

"రంగన్న సేమంగా ఉండొచ్చు కదా!" అంది ఓ ముసలమ్మ..

"ఎవరు చెప్పారు రంగన్న క్షేమంగా ఉన్నాడని? గుర్తుపట్టిన శవాల్లో రంగన్న శవం ఉన్నట్లు పేపర్లో వచ్చింది. సచ్చిపోయినోళ్లకు రెండువేలు, తీవ్రంగా గాయపడినోళ్లకు వెయ్యిరూపాయలు ఇస్తామని, వెంటనే వెళ్లి శవాల్ని గుర్తించి వివరాలు రాయించమని కలెక్టరుగారు ప్రకటించారు!" అన్నాడు పాంటు వేసుకోని పేపరుచేతిలో పట్టుకున్న ఓ కుర్రాడు.

"ఒకే దెబ్బకు రెండుపిట్టలు!" అన్నాడు ఓ నడివయస్కుడు.

"అదెట్లా?" ఆసక్తిగా ప్రశ్నించాడు అనుమానాల అంజయ్య.

"గంగులమ్మకు దెబ్బలూ తప్పుతాయి, రెండువేలొస్తే సంసారమూ బాగుపడుతుంది!"

"రోజూ రంపులు, రగళ్లు ఉండవులే!"

ఎవరికి తోచినట్లు వాళ్లు మాట్లాడసాగారు జనం.

ఎవరిమాటా వినపడ్డంలేదు గంగులమ్మకు. తను ఏడుస్తూ పిల్లల్ని ఓదారుస్తోంది.

"నాయిన ఇబుడే రాడామ్మా?" అడిగాడు నాగన్న..

"వ...త్తా...డు...!" అంది గంగులమ్మ మరీ కుమిలిపోతూ.

"పాపం తండ్రిలేని పిల్లలు!"

"దురదృష్టవంతులు!"

"దురదృష్టమేం కాదు. అదృష్టమే! రోజూ తాగొచ్చి పెళ్లాన్ని చితకబాదేటోడు. ఆ రెండువేలు లెక్క తెచ్చుకోని ఆయిగా పిల్లల్ని సాక్కుంటుంది!' ' సాను భూతి ఒలకబోశాడు ఓ వృద్ధుడు.

"ఏం లెక్క...ముదనష్టపు లెక్క...మా మావ పానాలకంటే అదెక్కువా?" అంది గంగులమ్మ ఆవేదనగా.

"పాపం మంచోడు రంగన్న ...!" మాటల ధోరణి మార్చారు గోడమీది పిల్లుల్లాంటి కొంతమంది జనం.

కాసేపు సానుభూతి కురిపించి ఒక్కొక్కరే జారుకున్నారు.

"ఎక్కడికి పోతానన్నాడక్కా, బావ?" అడిగాడు ఓబులేశు.

"నాకేమీ సెప్పలేదబ్బీ! ఇంగ నీ మొగం సూత్తే ... నీ ...!" దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. మాట పెగల్లేదు.

"అంటే ఇక ఇంటికి రానని, నీ ముఖం చూడనని ఒట్టేసుకుని ఎల్లిపోయినాడన్న మాట! వెల్దాం బయల్దేరక్కా!"

"లెక్కాలేదురా!" అంటూ గొల్లుమంది గంగులమ్మ.

"ఇంటికి పోయి తీస్కొస్తా!" అంటూ

వెళ్లిపోయినాడు ఓబులేశు.

* * *

గంగులమ్మ నెత్తి ఆలోచనలతో వేడెక్కి పోతావుంది.

మావ సచ్చిపోయినట్టేనా? ఊహుఁ, సావలేదు... సచ్చిపోకపోతే ఇంటికి ఎందుకురాడు? సచ్చిపోయుండాడని పేపర్లోకూడా రాసిండారంట. సచ్చిపోయుండాడు .... నిజంగా సచ్చిపోయుండాడు ... ఓరి దేవుడో ఎంత అన్నాయం సేసిండావురో ....మామ లేకపోతే నేను బతికీ ఏం లాబం .... నేను సచ్చిపోయినా ఆ మారాజుంటే పిల్లోల్లు బాగా సాక్కుండు. నా పిల్లలు దిక్కులేనోల్లయి పోయిండారు ... మా నాగడు పనికిమాలిన ఎదవ! మొన్న తొండాబిక్కిని సంపేసిండాడు. దానికి పిల్లలుండవూ ... అయి దిక్కులేనివయిండాయి. ఈడూ దిక్కులేనోడయినాడు ... అయితే నేను ఎవుర్నీ బాదపెట్టనే...నా మొగుడు ఎందుకు సావల్ల మల్ల ! నేను పాపిట్టిదాన్ని ... సాపిచ్చినా.. నీకు సావన్నా రాదే! అన్నా ... అందుకే సచ్చిపోయిండాడు ... నేను సంపేసినా... నేనే సంపేసినా ... నేనూ సచ్చిపోతే మేలు ...

"ఆకలయితాందమ్మా!" అన్నాడు నాగన్న. వాడి మాటవిని ఈ లోకంలో కొచ్చి వాడికేసి చూసింది. లోకంలోని దైన్యమంతా వాడి ముఖంలో కనిపిం చింది. గూడుకట్టిన దైన్యంలా ఉన్నాడు నాగడు.

"ఇంట్లో మనిసి సచ్చినా బతికినోల్ల ఆకలి సావదు ..." అనుకుంది గంగులమ్మ. కుండలో చూసింది - రాత్రి అన్నమేమన్నా మిగిలిందేమోనని. ఆలూమగల తగవులో కుండమీద మూతపెట్టడం మరిచిపోయింది రాత్రి. మిగిలిన కాస్త అన్నమూ ఎలకలు తినేశాయి.

అన్నం చేద్దామని లేచింది గంగులమ్మ. దొంతర దించి బానలో చూసింది. అడుగున కొద్దిగా నూకలున్నాయి. నూకలు కుండలోపోసి కడిగి పొయ్యిమీద పెట్టి పుల్లలు రాజేసింది.

* * *

బస్సుచార్జీలకు డబ్బుతీసుకుని ఇంటినుంచి బయల్దేరిన ఓబులేశు అక్క దుస్థితి తలు చుకుంటూ వడివడిగా నడుస్తున్నాడు.

"ఒరే ఓబులూ ఎక్కుఁరా అంత అరిజెంటుగా పరిగెత్తతా ఉండావ్?"

తన్నెవరో పిలుస్తున్నారని తిరిగి చూసిన ఓబులేశు అవాక్కయి ఆగిపోయాడు.

"ఏందిరా ఎదవనాయాలా ... అట్టా సూత్తాండావ్?"

"నువ్వు ... నువ్వు ... " అన్నాడు ఓబులేశు తడబడుతూ.

"నేనేరా నంగినాయాలా ... ఏంది అట్టా బిత్తరపోతాండావ్?"

"నువ్వు .... నిన్న ... బస్సులో ...!" అంటూ తల గొక్కున్నాడు ఓబులేశు.

"ఏందిరా ఇసిత్రంగా మాట్లాడతాండావ్ ... నేనేంది ... బస్సేంది?"

"నిన్న మాయక్కతో కొట్లాడి బస్సెక్కి పోయినావంట?"

"పోతే ?"

"నువ్వెక్కిన బస్సు లారీతో ఢీకొట్టిందంట."

"అవును."

"మరి నీకు దెబ్బలు తగల్లేదా?'

'పాత నేస్తుడు కనబడి మా ఊరికి పోదాం రా రంగా అంటే యఱ్ఱంపల్లిలో దిగినాం.'

"మరి శవాల్లో రంగన్న శవం వున్నట్లు పేపర్లో రాశారే!"

"అయ్యో ... ఆ సంగతి యాల సెపుతావులేరా ... అనుకుంటే ఏడుపొత్తుంది."

"ఎవరు బావా చనిపోయిన ఆ రంగన్న?"

"సచ్చిపోయింది రంగన్న కాదురా, గంగన్న."

"మరి రంగన్నని ఎందుకు రాసినారు?"

"వాడు నా పాన నేస్తుడు. నా మింది పేమతో తన చేతిమింద రంగన్న అని పచ్చబొట్టు పొడిపించుకుండాడు. అది సూసి రంగన్న అనుకుండారంట!" అన్నాడు రంగన్న.

"నువ్వా బస్సులో ఉన్నావేమోనని మేం ఎంత బయపడిపోతిమి!"

"నాకు అంత అదురుట్టం యాడుందిరా?" అంటూ నిట్టూర్చాడు రంగన్న.

"ఆ బస్సులో ఉండి సావడం అదృష్టమా?"

"కాదా? ఇబుడు సూడు దెబ్బల్తగిలినోల్లకు యెయ్యి రూపాయల్లు ఇత్తారంట. ఎన్నాల్లు రిక్సా తొక్కితే ఎయ్యిరూపాయలు మిగుల్తాయి?"

"అయ్యో నీ ఆశ పాడుగాను, చచ్చిపోయుంటే?"

"కూడూగుడ్డా లేకుండా బతికే ఈ బతుక్కంటే సచ్చిపోవడమే మేలుగదా? ఎబుడయినా సచ్చిపోవల్సిందే!"

"ఏం మాటలు బావా అవి? అక్కయ్య అప్పుడే చిక్కి సగం అయిపోయినాది."

"బలే సెప్పుండావులేరా! నేను సచ్చిపోతే దెబ్బలు, తిట్లు తప్పుతాయని సంతోసపడుంటాది నంజ!"

"ఏంది బావా, అట్ల మాట్లాడతావు?"

"అంతేరా, నేనంటే దానికి సరిపోదు!"

"మావ లేకుంటే ఎందుకు బతకాలి అంటూ నేలపట్టింది బావా!"

"అంతా నాటకంలేరా ... నాకు తెల్దా దాని సంగతి...!"

"ఇంటికి పద, నీకే తెలుస్తుంది. ఒక్కరోజుకే సగం మనిషి తగ్గిపోయిందనుకో!' అంటూ ముందుకు సాగాడు ఓబులేశు.

బావమరిదిని అనుసరించాడు బావ.

తన వెంట నెమ్మదిగా నడుస్తున్న బావ ఉన్నట్టుండి తన్ను వదిలేసి ముందుకు దూకడం చూసి ఉలిక్కిపడి చూసినాడు ఓబులేశు.

"గంగా!" అంటూ ఒక్క ఉదుటున గుడిసెలోకి దూరి నీళ్ల బాన ఎత్తుకుని, అప్పుడప్పుడే అంటుకుంటున్న గంగులమ్మ చీరమీద కుమ్మరించాడు రంగన్న.

మూత తీసేసిన కిరోసిన్‌బుడ్డీ మూతి మూడువంకర్లు తిప్పుకుంది అసూయతో - రంగన్నకు భార్యమీద ఉన్న మమకారం చూసి.

■

